క్లుప్తంగా

ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన



బొడ్రాయి ఊరేగింపులో భక్తులు

యాలాల: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన మంగళవారం ఉదయం సుప్రభాతసేవ, గ్రామ నాభిశిల(బొడ్రాయి) ఊరేగింపు, గోమాతపూజ, ధ్వజారోహణం, గణపతి, పూజపుణ్యాహవాచము, గౌరీపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం, నవగ్రహ హోమం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు.

పేదల సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

పరిగి: రాష్ట్రంలో పేద, మధ్య తరగతి కుటుంబాలే ఎక్కువ ఉన్నాయని, వారికి కనీస సౌకర్యాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం డీఎస్పీ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఆనంద్‌రావుకు పేదల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇల్లు ఇస్తామన్న హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు పేద ప్రజలకు అందించాల్సిన సంక్షేమాలను ఉన్నత వర్గానికి మళ్లిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో శివ, వెంకటేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్‌పర్సన్‌కు పరామర్శ



మంజులను పరామర్శిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్‌కు వైరల్ జ్వరం రావడంతో మంగళవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ పట్టణంలోని ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రాములు యాదవ్, సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి, గుడిసె లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో నమూనా ఎన్నికలు



ఓటును వేస్తున్న విద్యార్థి

అనంతగిరి: వికారాబాద్ మండలంలోని సిద్దులూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు నమూనా ఎన్నికలు నిర్వహించారు. ఈ పోటీల్లో 5మంది విద్యార్థులు పోటీపడగా ఇందులో పదో తరగతి విద్యార్థి అంజన్‌కుమార్ పాఠశాల ప్రతినిధిగా ఎన్నికయ్యారు. నిజమైన ఎన్నికలు తలపించేలా వీటిని నిర్వహించారు. ఈ ప్రక్రియలో ఓటరు లిస్టు, బ్యాలెట్ పేపర్స్, బ్యాలెట్ బాక్సులు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆంజనేయులు, మీనాకుమారి, వినోద్‌కుమార్, ప్రతాప్, బాబురావు, వెంకటేశం, శ్రీదేవి, సంగీత, నాగలత, స్వర్ణలత, రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రైస్ మిల్లు ప్రారంభం

ధారూరు: మండల కేంద్రంలో ధారూరు పీఏసీఎస్ ఆధ్వార్యంలో నిర్మించిన నూతన రైస్ మిల్లు, గోదాంను ఈ నెల 21న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రారంభిస్తారని సంఘం చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాబార్డు సహకారంతో రైస్‌మిల్లు, గోదాం నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం రైస్ మిల్లు ప్రారంభోత్సవానికి స్పీకర్ ప్రసాద్‌కుమార్ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రయాణం.. ప్రమాదం

- వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణం
- రోజురోజుకూ పెరుగుతున్న యాక్సిడెంట్ కేసులు
- ఆందోళనలో ప్రయాణికులు



కోస్గి నుంచి దౌల్తాబాద్‌కు అధిక ప్రయాణికులతో వెళ్తున్న ఆటో



అంతారం నుంచి బాలంపేట రోడ్డులో

దౌల్తాబాద్: వాహన పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదాలు కొని తెచ్చుకోవడం నిత్యకృత్యమయ్యాయి. ప్రయాణికులు త్వరగా గమ్యస్థానం చేరుకోవాలనే ఉద్దేశంతో డ్రైవర్లు నిబంధనలను గాలికొదిలేస్తున్నారు. మండల వ్యాప్తంగా ఒక్క క్షణం కూడా సురక్షిత ప్రయాణం కోసం వేచి చూడకుండా ఇష్టారీతిన ప్రయాణం చేస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను చూస్తుంటే ప్రయాణమంటేనే భయమేస్తుందని ప్రజలు వాపోతున్నారు. ప్రయాణికులు త్వరగా గమ్య స్థానానికి చేరుకోవాలనే ఉద్దేశంతో ప్రైవేటు వాహనాలలో ప్రయాణించాల్సి వస్తోందని తెలుపుతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఆటోలు, జీపుల వంటి ప్రైవేటు వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని, మితిమీరిన వేగంతో వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శిక్షణ లేని డ్రైవర్లు ఇష్టానుసారంగా వాహనాలను నడపడం కూడా ప్రమాదాలకు కారణమని పేర్కొంటున్నారు.

అరచేతిలో ప్రాణాలు

మరోవైపు ఆర్టీసీ బస్సులు సమయానికి రావని, బస్టాప్ ఉన్న దగ్గర మాత్రమే బస్సులను నిలుపుతారని చెబుతున్నారు. ప్రైవేటు వాహనదారులు ఎక్కడైనా ఎక్కించుకుని అవసరమున్న చోట ఆపుతారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వాహనాదారులు బ్యాంకుల్లో అప్పులు తీసుకుని ఆటో, జీపుల వంటి వాహనాలను కొనుగోలు చేసి బతుకు పోరాటం సాగిస్తున్నారు. అయితే ప్రైవేటు బ్యాంకుల్లో తెచ్చిన అప్పులు తీర్చేందుకు ఒకరితో ఒకరు పోటీ పడాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో ఆటోలు, జీపులు వాహనాల సంఖ్య బాగా పెరగడంతో ఒకేసారి పదుల సంఖ్యలో వాహనాలు బయలుదేరుతున్నాయి. దీంతో ప్రయాణికుల కోసం అతివేగం, అధిక ప్రయాణికులతో బయలుదేరాల్సి వస్తోందంటున్నారు. ఏది ఏమైనా ప్రయాణికులు మాత్రం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నామని అంటున్నారు. ఇటీవల మండలంలోని కోస్గి రోడ్డులో చల్లాపూర్ గ్రామం వద్ద ఆటో బోల్తా పడి ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మద్దూరు రోడ్డులోని దేవర్‌ఫసల్వాద్ గ్రామం వద్ద ఆటో కింద పడి ముగ్గురు గాయపడ్డారు. గతంలోనూ జరిగిన ప్రమాదాల్లో అనేక మంది అసువులుబాశారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



ఉత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: మండల పరిధిలోని కడ్మూర్ శివాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో మంత్రోశ్చరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గ్రామ సమీపంలో ఉన్న ఈసీ వాగులో నుంచి నీటిని తెచ్చి ఘనంగా అభిషేకం చేశారు. పరిగి ఎమ్మెల్యే టీ.రామ్మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కడుమూరు ఆనందం, జిల్లా నాయకులు రఘునాథ్‌రెడ్డి, పెంటయ్య, బీజేపి కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు సురేందర్, నాయకులు నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, శంకరాచారి, అనిల్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



దుద్యాల్: సాగారం తండాలో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

దుద్యాల్: మండల పరిధిలోని సాగారం, సత్తర్‌కుంట తండాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు, చెప్పులను అక్షిత్ ఫౌండేషన్ మంగళవారం అందించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా ఎఫ్ఓ పులిందర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. రెండు పాఠశాలలో కలిపి 60 మంది చిన్నారులకు బ్యాగులు, మ్యాట్లు, చెప్పుల జోళ్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎం వెంకటేశ్, ఉమా మహేశ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నరేందర్, సీఆర్‌పీ రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల అందజేత

యాలాల: మండలంలోని హాజీపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. తాండూరు పట్టణ సమీపంలోని మార్కండేయ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

కుర్చీల వితరణ

తాండూరు టౌన్: బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం జన్మదినాన్ని పురస్కరించుకుని పాత తాండూరులోని అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు, కుర్చీలు, వాటర్ ట్యాంక్, కుక్కర్ తదితర వస్తువులను అందజేశారు. జన్మదినం సందర్భంగా చిన్నారులకు సాయం చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



రాపోల్‌లో పర్యటిస్తున్న ఎంపీడీఓ తదితరులు

పరిగి: గ్రామాల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించాలని ఎంపీడీఓ కరీం సూచించారు. మంగళవారం మండల పరిధిలోని రాపోల్ తదితర గ్రామాల్లో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వ్యక్తిగత శుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రభుత్వం నుంచి గతంలో ఇచ్చిన మరుగుదొడ్లను ప్రతిఒక్కరూ నిర్మించారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ప్రజా సమస్య పరిష్కారం కోసం గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, కాంగ్రెస్ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగదర్శన్, వెంకటేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భోజన వసతి



సంతలో రైతులకు భోజనం వడ్డిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

మర్పల్లి: పశువుల క్రయవిక్రయాలు చేసే రైతులు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత భోజన వసతిని సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ మహేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మర్పల్లి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పశువుల సంతలో ఉచిత భోజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మూడు దశాబ్దాల నుంచి మర్పల్లి మార్కెట్‌లో పశువుల సంత కొనసాగేదని ఆయన గుర్తు చేశారు. సంతలో పశువులను క్రయ విక్రయాలు చేసుకొనేందుకు వచ్చే రైతులకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత భోజనం వడ్డిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మల్లేశ్‌యాదవ్, డైరెక్టర్ రాజశేఖర్, మార్కెట్ కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, సూపర్ వైజర్ లక్ష్మయ్య, సహకార సంఘం వైస్ చైర్మన్ ఫసియోద్దీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, రైతులు విష్ణువర్ధన్‌రెడ్డి, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల అందజేత

అనంతగిరి: ప్రతిఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని యజ్ఞ ఫౌండేషన్‌లో అనాథ పిల్లలకు స్టాంప్ వెండర్ అశోక్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు అంది వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చిన్నప్పటి నుంచే లక్ష్యాలను పెట్టుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉజ్వల్ కుమార్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలతో రైతులకు మేలు

పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి



రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ధారూరు: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్ వై.సత్యనారాయణరెడ్డి రైతులకు సూచించారు. మండల పరిధిలోని మోమిన్‌కలాన్, గురుదోట్ల, రాంపూర్‌తండా, నాగారం గ్రామాల్లో ఆయన మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు 17 శాతం తేమ ఉండేలా ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. ఏ గ్రేడ్ సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,320తో పాటు రూ.500 ప్రభుత్వం బోనస్ ఇస్తుందన్నారు. బీ గ్రేడ్‌కు రూ.2,300కు కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాన్‌సింగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అశోక్ ముదిరాజ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాములు, మాజీ సర్పంచ్ పాండునాయక్, ఏఎంసీ డైరెక్టర్లు వాణిశ్రీ, మాణిక్యం, రవీందర్, నర్సింహారెడ్డి, అంజయ్య, జైపాల్, నాయకులు రాజేందర్, మహ్మద్ బాబాఖాన్, గఫార్, జాకీర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ఏర్పాటుపై సర్వే

లగచర్లలో పాలమూరు అధ్యయన వేదిక అభిప్రాయ సేకరణ



లగచర్లలో ఓ ఇంటి దగ్గర సర్వే చేస్తున్న అధ్యయన వేదిక సభ్యులు

దుద్యాల్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మా కంపెనీలపై పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి వ్యక్తిగతంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సర్వే చేపట్టారు. మంగళవారం లగచర్లలో సర్వే ప్రారంభించారు. దాంతో పాటు ఈ నెల 11న కలెక్టర్‌పై జరిగిన దాడి సంఘటనపై కూడా అభిప్రాయ సేకరణ జరిపినట్లు తెలిపారు. అనంతరం విలేకర్ల సమావేశంలో అక్కడి పరిస్థితులను వెల్లడించారు. ఎనిమిది నెలలుగా ఫార్మా ఏర్పాటు వద్దంటూ రైతులు ధర్నాలు, ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. ఈ నెల 11 నుంచి 16 వరకు లగచర్ల, రోటిబండ తండా, పులిచెర్లకుంట తండాల్లో పోలీసులు ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. లగచర్ల ఘటనను ఆసరగా చేసుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు పరస్పరం కుమ్ములాడుకుంటున్నాయని ఆక్షేపించారు. చాలా మంది రైతులపై అక్రమ కేసులు పెట్టి పోలీసులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో రైతులను హింసకు గురిచేయడం తగదని, ఫార్మా కంపెనీని వెంటనే రద్దు చేయాలని సూచించారు. రైతులపై కేసులు ఎత్తివేయాని ప్రజలు అభిప్రాయ పడుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు సురేశ్, శ్రీనివాస్, చంద్రశేఖర్, చంద్రయ్య, వామన్ కుమార్, న్యాయవాది భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి



ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

తాండూరు టౌన్: వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో పట్టణంలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ పెత్తనాన్ని, నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి లక్ష్మీబాయి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం, ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, నాయకులు రాజు, ప్రకాష్, షాబుద్దీన్, ప్రహ్లాద్, సాయిలు, పకీరప్ప, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

బంట్వారం: అంగన్‌వాడీ సెంటర్లలో చిన్నారుల పట్ల శ్రద్ధ వహించి అక్షరాలు నేర్పించాలని ఎంపీడీఓ రాములు సూచించారు. మంగళవారం ఆయన బొప్పునారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులతో మాట్లాడారు. ప్రతిరోజు పిల్లలని సెంటర్‌కు తీసుకురావాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. పిల్లలకు ఆటపాటలతో బాగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం అందించాలన్నారు. అనంతరం మరుగుదొడ్డి పనులను పరిశీలించారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే



దోమ: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు



దుద్యాల్: లగచెర్లలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

దోమ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను ఎన్యుమరేటర్లు సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఉన్నటువంటి తొమ్మిది బ్లాక్‌లలో నిర్వహిస్తున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో తప్పులు దొర్లకుండా చేపట్టాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను సమగ్రంగా సేకరించాలని తెలిపారు. సేకరించి ఫారాలను డాటా ఎంట్రీ నిమిత్తం సంబంధిత సూపర్‌వైజర్లకు వెంటనే అందించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ సోమలింగం, ఎన్యుమరేటర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తండాల్లో నిలిచిన సర్వే

దుద్యాల్: మండలంలో గత పది రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో కులగణన సర్వే జోరుగా సాగుతుంది. ఒక్కో ఎన్యుమరేటర్‌కు దాదాపు 150 నుంచి 170 వరకు ఇళ్లను అప్పగించారు. మంగళవారం వరకు 140కి పైగా ఇళ్ల కుటుంబాలకు సంబంధించిన సర్వే పూర్తయిందని ఎన్యుమరేటర్లు తెలిపారు. మండలంలోని రోటిబండ తండా, పులిచెర్ల తండాలో ఫార్మా రైతుల సమస్యతో కులగణన సర్వే పూర్తిగా నిలిచిపోయింది.

సర్వే వేగవంతం చేయాలి

బంట్వారం: ఇంటింటి కులగణన సర్వేను మరింత వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాములు సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని బొప్పునారం గ్రామాన్ని సందర్శించి సర్వే సరళిని పరిశీలించి మాట్లాడారు. 22వ తేదీ వరకు సర్వే గడువు పొడిగించారని తెలిపారు. సమయం తక్కువగా ఉండడంతో మరింత వేగం పెంచాలన్నారు. ఇప్పటివరకు 60శాతం మాత్రమే సర్వే చేశారన్నారు.

సీఎంను కలిసిన మెట్లకుంట నేతలు



సీఎంతో నర్సింలునాయుడు తదితరులు

బొంరాస్‌పేట: ఏళ్లుగా మట్టి రోడ్డుకు పరిమితమైన తమ గ్రామానికి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడంతో మంగళవారం సీ ఎం రేవంత్‌రెడ్డిని మండల పరిధిలోని మెట్లకుంట నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. రూ.4.20 కోట్ల నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. బుర్రితండా వద్ద జాతీయ రహదారి 163 నుంచి మెట్లకుంట మీదుగా బొంరాస్‌పేట బురాన్‌పూర్ వైపు పెట్రోల్ బంకు వద్దకు 2.8 కిలోమీటర్ల దూరం బీటీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారన్నారు. సీఎంను కలిసివారిలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింలునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ దేశ్యానాయక్ పాల్గొన్నారు.



పరిగి: ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



పెద్దేముల్: రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

దేశంలో తొలి మహిళా ప్రధానమంత్రి ఇందిరా గాంధీని నాయకులు స్మరించుకున్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, నాయకులు ఆమె జయంతి సందర్భంగా విగ్రహాలు, చిత్రపటాల వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల వ్యాప్తంగా భారీగా సంబురాలు చేపట్టారు. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు.

– సాక్షి, నెట్‌వర్క్



యాలాల: మండల కేంద్రంలో ఇందిరాగాంధీ జయంతిలో నేతలు



కుల్కచర్ల: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



మర్పల్లి: కోట్‌మర్పల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు